# ఐదేళ్లలో రూ. 1,000 కోట్ల టర్నోవర్!

**సాక్షి ఇంటర్వ్యూ** | **పెబ్స్ పెన్నార్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.వి.రావు**

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రీ-ఇంజినీర్డ్ బిల్డింగ్ (పీఈబీ) సిస్టమ్స్ రంగంలో నిమగ్నమైన పెన్నార్ ఇండస్ట్రీస్ అనుబంధ సంస్థ పెన్నార్ ఇంజినీర్డ్ బిల్డింగ్ సిస్టమ్స్ లిమిటెడ్ (పెబ్స్ పెన్నార్) విస్తరణపై దృష్టిసారించింది. ఒకవైపు ఉత్పత్తి సామర్థ్యం పెంపుదల కోసం ఉత్తరాదిలో మరో ప్లాంటు ఏర్పాటు యోచనలో ఉంటూనే.. మరోవైపు ఉత్పత్తులను ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేసే ప్రణాళికలను రూపొందిస్తోంది. మూడేళ్ల క్రితమే పీఈబీ రంగంలోకి ప్రవేశించిన ఈ సంస్థ వేగంగా రూ.300 కోట్ల టర్నోవర్‌కు చేరువయ్యింది. డబుల్ లాక్ సిస్టమ్ వంటి లీకేజీ రహిత ఉత్పత్తులతో మార్కెట్ వాటాను పెంచుకుంటోంది. ఈ నేపథ్యంలో పెబ్స్ పెన్నార్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.వి.రావు 'సాక్షి బిజినెస్ బ్యూరో'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ విశేషాలు...

**పీఈబీ కాన్సెప్ట్‌కు ఆదరణ ఎలా ఉంది, మార్కెట్ పరిమాణం ఎంత?**

భారత్‌లో ప్రీ-ఇంజినీర్డ్ బిల్డింగ్స్ కాన్సెప్ట్ 2000 సంవత్సరంలోనే పరిచయమైంది. ప్రస్తుతం ఈ రంగ మార్కెట్ పరిమాణం రూ.4,000 కోట్లు. ఇది ఏటా 10-15% చొప్పున వృద్ధి చెందుతోంది. పూర్తిగా స్టీలు (ఉక్కు)తో భవనాలు, ఫ్యాక్టరీల వంటి నిర్మాణాలు చేపట్టడం పీఈబీ ప్రత్యేకత. కస్టమర్ సూచించిన ప్రకారం నిర్దిష్ట కొలతలతో మా ఫ్యాక్టరీలోనే భవనాన్ని (ఏదేని నిర్మాణం) డిజైన్ చేస్తాం. ఈ విడి భాగాలను కస్టమర్ కోరుకొన్న చోట బిగించడంతో పనిపూర్తవుతుంది. సంప్రదాయ భవనంతో పోల్చితే ప్రీ-ఇంజినీర్డ్ బిల్డింగ్ చవక. త్వరగా నిర్మించవచ్చు. చూడ్డానికి బాగుంటుంది. నాణ్యత మెరుగ్గా ఉంటుంది. ఫౌండేషన్ వ్యయం తక్కువ. పీఈబీ సిస్టమ్స్ కేవలం పారిశ్రామిక, వేర్‌హౌజింగ్ ఉపయోగానికే పరిమితం కాలేదు. విద్యుత్ జనరేషన్ బిల్డింగ్స్, కోల్డ్

### లీకేజీ లేకుండా ప్రీ ఇంజినీర్డ్ బిల్డింగులు!

- డబుల్ లాక్ సిస్టమ్‌ను అందిస్తున్న పెబ్స్ పెన్నార్
- త్వరలో గుజరాత్‌లో పీఈబీ యూనిట్ కొనుగోలు
- అక్కడి నుంచే ఆఫ్రికా దేశాలకు ఎగుమతులు



స్టోరేజీలు, రిటైల్ చెయిన్లు, స్టేడియాలు, మెట్రో రైలు స్టేషన్లు వంటి విభిన్న విభాగాలకు ఇది విస్తరించింది.

**సంప్రదాయ ప్రక్రియతో పోల్చితే పీఈబీ సిస్టమ్ వల్ల ఉపయోగాలు?**

ప్రపంచవ్యాప్తంగా పర్యావరణహితమైన కొత్త పద్ధతులపై ఆసక్తి పెరుగుతోంది. పలు గ్రీన్ బిల్డింగ్స్ కాన్సెప్ట్‌కు ప్రాధాన్యమిస్తున్నాయి. ఉక్కును రీసైకిల్ చేయవచ్చు కాబట్టి, దీనిని పర్యావరణహితమైనదిగా పరిగణిస్తున్నారు. పీఈబీ నిర్మాణాల వల్ల సహజ వెలుతురు వినియోగం పెరిగి ఇంధన వినియోగం తగ్గుతుంది. రూఫ్ ఇన్సులేషన్, గోడలు, కిటికీల నిష్పత్తి బాగుంటుంది. ఇటీవల రూఫ్ టాపుల్లో సోలార్ ప్యానళ్లను బిగించడం పెరుగుతోంది.

**పీఈబీ రంగంలో మానవ వనరుల కొరత, ఇతర సవాళ్ల మాటేమిటి?**

భారత్‌లో నిపుణులైన మానవ వనరుల కొరత అధికంగా ఉంది. ఇది ఒక్క పీఈబీకే పరిమితం కాలేదు. ఇంజినీరింగ్‌లో సూపర్‌వైజరీ నిపుణుల కొరతతో పాటు సేల్స్ అండ్ మార్కెటింగ్, ఎరెక్షన్ వంటి విభాగాల్లోనూ సమస్య వేధిస్తోంది. ఒరిస్సా, బీహార్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, అస్సాం నుంచి ఎరెక్టర్లను నియమించుకోవాల్సి వస్తోంది. మన రాష్ట్రంలో 750 ఇంజినీరింగ్ కాలేజీలున్నప్పటికీ.. కేవలం 150 కాలేజీల్లోనే సివిల్ ఇంజినీరింగ్ బ్రాంచ్ ఉండటం పరిస్థితికి అద్దం పడుతుంది. బ్యాంకుల వడ్డీరేట్లు మరో సమస్య. మల్టీబ్రాండ్ రిటైల్‌లోకి ఎఫ్‌డీఐల అనుమతి ఈ రంగానికి సానుకూలం. ప్రభుత్వం ఈ రంగంలో వాడే ఉక్కుపై పన్నులు, సుంకాలను తగ్గిస్తే బెటర్. అమెరికా, చైనా, యూరప్‌లో తలసరి స్టీలు వినియోగం 200 కిలోలు కాగా, మన దేశంలో కేవలం 40 కేజీలే. భూకంపాలను తట్టుకోవడంలోనూ ఇవి మెరుగైనవి కాబట్టి, ప్రభుత్వం, ఆర్కిటెక్టులు పీఈబీ నిర్మాణాలను ప్రోత్సహించాలి.

**పీఈబీ నిర్మాణాల్లో లీకేజీల సమస్యపై అనుమానాలున్నాయి కదా?**

అవును. అయితే, మేము అమెరికాకు చెందిన ఎన్‌సీఐ గ్రూప్‌తో కలిసి లీకేజీ లేనటువంటి 'స్టాండింగ్ సీమ్ సిస్టమ్ (డబుల్ లాక్ పద్ధతి)'ను అందిస్తున్నాం. మొబైల్ రోల్ ఫామర్ వినియోగం వల్ల ఈ సమస్యను అధిగమించవచ్చు. డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్, పీఅండ్‌జీ, ఎల్‌అండ్‌టీ, రెనో నిస్సాన్, బోష్, టయోటా వంటి సంస్థలకు మేం సరఫరా చేసిన పీఈబీలో ఈ ఉత్పత్తిని విజయవంతంగా ఉపయోగించాం. రాజస్థాన్‌లో అల్ట్రాటెక్ సిమెంట్స్ కోసం 99 మీటర్ల పొడవుగల భారీ బిల్డింగ్‌ను నిర్మిస్తున్నాం.

**పెబ్స్ పెన్నార్ స్వల్ప, దీర్ఘకాలిక లక్ష్యాల గురించి చెబుతారా?**

ఇది 2009లో ఏర్పాటైన పెబ్స్ పెన్నార్.. 2010 జనవరిలో వాణిజ్యపరమైన ఉత్పత్తిని ప్రారంభించింది. 2010-11 ఏడాదిలోనే రూ.6.5 కోట్ల నికర లాభంతో రూ.165 కోట్ల టర్నోవర్‌ను సాధించింది. 2011-12లో ఆదాయం రూ.279 కోట్లకు పెరగ్గా.. నికర లాభం రూ.10.41 కోట్లకు చేరుకొంది. 2012-13లో మా టార్గెట్ రూ.350 కోట్ల టర్నోవర్. వచ్చే ఐదేళ్లలో రూ.1,000 కోట్ల టర్నోవర్‌ను సాధించాలన్నది మా లక్ష్యం.

**మార్కెట్ అవసరాల దృష్ట్యా ఉత్తరాదిలో ప్లాంటు ఏర్పాటు చేస్తామన్నారు. అది ఎంత వరకు వచ్చింది?**

అవును. గుజరాత్ లేదా రాజస్థాన్‌లో రెండో తయారీ ప్లాంటును ఏర్పాటు చేయాలనుకొన్నాం. కానీ, గుజరాత్‌లో రెడీగా ఉన్న యూనిట్లు కొన్ని అమ్మకానికి వచ్చాయి. అందులో మాకు సరిపోయే మంచి యూనిట్‌ను కొనుగోలు చేయబోతున్నాం. చర్చలు జరుగుతున్నందున విలువ వెల్లడించలేం. 2-3 నెలల్లోనే కొనుగోలు పూర్తవుతుంది. అప్పుడు గుజరాత్ సహా ఉత్తరాది మార్కెట్‌కు ఉత్పత్తులను అందించడంతో పాటు అక్కడి నుంచే ఆఫ్రికా దేశాలకు ఎగుమతులు చేయాలని భావిస్తున్నాం. ఎగుమతుల వాటా 10-15 శాతంగా ఉండనుంది.